క్లుప్తంగా

ఘనంగా గౌరారంగ ప్రభు జయంతి వేడుకలు



తెనాలిటౌన్: పట్టణ గాంధీనగర్‌లోని కుసుమ హరనాథ మందిరంలో గౌరారంగ ప్రభు జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిపారు. మందిరంలో ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5.45 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అత్తోట యాదవపాలెంకు చెందిన భక్తులు హరేరామ–హరేకృష్ణ నామ సంకీర్తన చేశారు. భభక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, మందిరం కమిటీ సభ్యులు సుజాత, మోహనరావు, భక్తులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 1 నుంచి పరిశుద్ధ సమాజ కూడికలు

తెనాలిఅర్బన్: ఫిలదెల్ఫియా చర్చి ఆధ్వర్యంలో ఏప్రిల్ 1, 3 తేదీల్లో పరిశుద్ధ సమాజ కూడికలు నిర్వహించనున్నట్లు పాస్టర్ సీహెచ్ నతానియేలు ఒక ప్రకటనలో తెలిపారు. మారీసుపేట రెండు గేట్ల మధ్యలోని కొలకలూరు మత్తయ్య హాస్టల్ ఆవరణలో ప్రతిరోజు రాత్రి 7 గంటలకు సభలు ప్రారంభమవుతాయని చెప్పారు. సభల్లో విజయవాడకు చెందిన బ్రదర్ సీహెచ్ డేవిడ్ బ్రెన్‌హాం, ధరణికోటకు చెందిన బ్రదర్ రేనాల్డ్స్ బాబులు వాక్యపరిచర్య చేస్తారని చెప్పారు. అందరూ పాల్గొనాలని కోరారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం



తెనాలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజి ఎన్‌ఎస్‌ఎస్ విభాగం దత్తత తీసుకున్న రూరల్ మండల గ్రామం పెదరావూరులో వారం రోజుల ప్రత్యేక శిబిరం సోమవారంతో ముగిసింది. తొలిరోజున నేల పరిరక్షణతో మొదలుపెట్టి, రెండోరోజున మొక్కలు నాటారు. తర్వాతిరోజు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. నాలుగోరోజు నుంచి స్వచ్ఛ భారత్, మత్తుపదార్థాలతో కలిగే హానిపై అవగాహన, భూగర్భ జలాల పరిరక్షణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్లపల్లి వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ విభాగం అధికారి కె.కళ్యాణ్‌చక్రవర్తి, ఎన్ఎస్ఎస్ విభాగం వలంటీర్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ రవిశంకర్‌రెడ్డికి కాలేజి ప్రిన్సిపాల్ ధన్యవాదాలు తెలియజేశారు.

ఆర్టీసీ ఉద్యోగి సేవకు గౌరవం



తెనాలి: వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రత్యేక సభలో తెనాలికి చెందిన ఈపూరి ప్రేమ్‌కుమార్‌కు 'మన గద్దరన్న ఐడియాలజీ అవార్డు–2024ను ప్రదానం చేసి సత్కరించారు. ఏపీఎస్ ఆర్టీసీ, తెనాలి డిపో మేనేజర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రేమ్‌కుమార్ చేస్తున్న సామాజిక సేవకు ఈ గౌరవం దక్కింది. కరోనా సమయంలో ఆర్టీసీ ఉద్యోగులకు, తన స్వగ్రామం పెదరావూరులో అందించిన సేవలు, పేదలకు అన్నదానం, శవదహన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కరోనా కాలంలో ఎనిమిది పర్యాయాలతో సహా మొత్తం 28 సార్లు రక్తదానం చేశారు. ప్రేమ్‌కుమార్‌కు ఆర్టీసీ ఉద్యోగులు, పెదరావూరు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

కౌలు రైతు ఆత్మహత్య

కొప్పర్రు(కాకుమాను): వ్యవసాయానికి చేసిన అప్పులు తీర్చలేక, కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన ఘటన పెదనందిపాడు మండలంలోని కొప్పర్రులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వల్లపర్ల వెంకటేశ్వర్లు(39) తనకున్న రెండు ఎకరాలతో పాటు మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని మినుము సాగు చేశాడు. పంట ఆశించిన స్థాయిలో లేకపోవడంతో వ్యవసాయం నిమిత్తం చేసిన రూ.6 లక్షల రుణం ఎలా తీర్చాలో తెలియక ఆదివారం రాత్రి పురుగు మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు గుంటూరు ప్రజా వైద్యశాలకు అతనిని తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి వెంకటేశ్వర్లు మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ప్రజల అజెండాతో జగన్ సింహంలా వస్తున్నాడు

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శివకుమార్, నాయకులు

తెనాలిరూరల్: రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు గుంపులుగా వస్తుంటే ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ప్రజల అజెండాతో సింహంలా సింగిల్‌గా వస్తున్నాడని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పట్టణ 23వ వార్డులో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సుమారు 150 కుటుంబాలు ఎమ్మెల్యే శివకుమార్ నేతృత్వంలో సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సుమారు 10 ఏళ్లుగా తెనాలి ప్రజలకు అందుబాటులో ఉండని వ్యక్తి ఇప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థినని వస్తున్నాడని, కరోనా కష్టకాలంలో సదరు వ్యక్తి ఎక్కడున్నాడని ప్రశ్నించారు. నియోకవర్గంలో 27 వేల పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇస్తే టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఓర్చుకోలేకపోతున్నారని చెప్పారు. ఇటీవల పెదరావూరులో జరిగిన కార్యక్రమంలో జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ సుమారు రూ.500 కోట్లు ఖర్చు చేసి పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సిన అవసరమేముందని, ఆ ఖర్చుతో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని విమర్శించారని, ఇదే నాదెండ్ల మనోహర్ తెనాలి ఎమ్మెల్యేగా పనిచేసిన పదేళ్ల కాలంలో ఎన్ని పరిశ్రమలు తెచ్చారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పర్చిందని, ఇదే అసలైన అభివృద్ధి అన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు గతంలో ప్రజలకు ఏదైనా మంచి చేసి ఉంటే అది చెప్పుకుని ఎన్నికలకు వెళ్లాలని, రాష్ట్రంలో ఒక్క జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ పార్టీ మినహా మరే ఇతర పార్టీ పొత్తు లేకుండా 175 నియోజకవర్గాల్లో పోటీ చేయలేదన్నారు. నాలుగు నెలల 10 నెలల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఇందులో రెండేళ్లు కరోనా కారణంగా ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం ఆపలేదని గుర్తు చేశారు. మిగిలిన రెండేళ్ల 10 నెలల కాలంలోనే గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని, ప్రజలు గమనించాలని కోరారు. ఒక్క తెనాలి నియోజకవర్గంలోనే నాలుగేళ్ల 10 నెలల కాలంలో రూ.1,800 కోట్ల సంక్షేమ లబ్ధిని ప్రజలకు అందించామని తెలిపారు. ఒక్క 23వ వార్డులోనే 1300 కుటుంబాలకు ఇళ్ల స్థలాలను అందించామని చెప్పారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే తనను, ఎంపీ అభ్యర్థి కిలారు వెంకటరోశయ్యలను రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు తోక శిరీష, పెదలంక లక్ష్మీలావణ్య, తాడిబోయిన రామయ్య, షేక్ దుబాయ్ బాబు, పేరం సంజీవరెడ్డి, తాడిబోయిన రమేష్ మాట్లాడారు. పార్టీ నాయకుడు మేకల సురేష్ అధ్యక్షత వహించగా, ఉడుముల మహేష్‌రెడ్డి, షేక్ పెద్ద సుభాని, తాడిబోయిన వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి, తోక వాసు, పెదలంక వెంకటేశ్వరరావు, జేబీ స్టీల్స్ జిలానీ, డాక్టర్ సుబ్రహ్మణ్యం, పోతార్లంక చైతన్య, షేక్ సిమ్‌కాక్స్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన టీడీపీ నేతలతో ఎమ్మెల్యే శివకుమార్

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ ముఖ్య నేతలు

తెనాలి: పట్టణ 23, 24 వార్డులకు చెందిన టీడీపీ ముఖ్య నాయకులు బొంత సురేష్, గోడె వెంకటేశ్వరరావులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వీరికి పార్టీ కండువాలను కప్పి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్న తీరుకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు సురేష్, వెంకటేశ్వరరావు చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మేకల సురేష్, పెద్దలంక వెంకటేశ్వరరావు, తోక వాసు, షేక్ పెద్ద సుభాని, 23వ వార్డు పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, లక్ష్మి, కృష్ణారెడ్డి, వెంకట రామరాజు, ఖాశిం, గోపి పాల్గొన్నారు.

కఠెవరంలో ఎన్నికల ప్రచారం ప్రారంభం

తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరం గ్రామంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు సత్యనారాయణ ఎన్నికల ప్రచారం సోమవారం ప్రారంభించారు. తొలుత గణేష్ విగ్రహం వద్ద కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. అనంతరం దళితవాడ సెంటర్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితవాడలోని మహిళలు, యువకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి దీవించారు. పార్టీ నాయకులతో కలసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో పార్లమెంటు అభ్యర్థి కిలారి రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌లను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారానికి విశేష స్పందన లభించింది. ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, ఎంపీటీసీ సభ్యులు మైలా భానుప్రసాద్, మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సంకురు బుజ్జిబాబు, మాజీ ఉపసర్పంచ్ మంచాల సురేష్, పార్టీ గ్రామ కన్వీనర్ తమ్మా శివారెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు బొనిగల సునీత, కొత్తపల్లి సుదర్శన్, ముక్కాల మహేష్, షేక్ బుజ్జి, పార్టీ నాయకులు ఎల్.చిన్నిబాబు, బొనిగల సురేష్, షఫీ, తుల్లిమిల్లి సువర్ణబాబు, సురేష్ వర్మ, మాదాల శివనారాయణ, నారయ్య, కోటిరెడ్డి, పినపాటి అనిల్, కందుల రాంబాబు, గొరికపూడి బాలరాజు, బెజ్జం బాజీ, కొండమూది విజయ్, ఆలీనగర్ బాషా, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాన్ని అందజేస్తున్న జెడ్పీటీసీ ఉమాప్రణతి, ఎమ్మెల్యే కుమారుడు సత్యనారాయణ

ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలి

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వినతి

తెనాలి: సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్)ని పకడ్బందీగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, సామాన్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ముంబై) కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు విజ్ఞప్తి చేశారు. ఆ ప్రకారం సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఎం.రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు నియమావళిని ఉల్లంఘించరాదని, విద్యార్థి, యువజన సంఘాలు సభలు, సమావేశాలకు, ప్రదర్శనలకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. సామాన్య ప్రజల రక్షణకోసం తమ కౌన్సిల్ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. వీరితో తెనాలి నియోజకవర్గ కన్వీనర్ నన్నపనేని సునీల్‌కుమార్, కమిటీ సభ్యులు ఎం.మణికంఠ, ఎం.లిఖిత్, కె.ఫణికుమార్, శివశ్యాం, చరణ్ ఉన్నారు.



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న నాగరాజు

ఘనంగా నాంచారమ్మతల్లి తిరునాళ్ల

శలపాడు(చేబ్రోలు): మండలంలోని శలపాడు గ్రామ దేవత నాంచారమ్మ తల్లి తిరునాళ్ల సోమ వారం వైభవంగా జరిగింది. పురాతనమైన అమ్మ వారి ఆలయాన్ని భక్తుల సహకారంతో రెండేళ్ల క్రితం పునఃనిర్మించారు. పాల్గుణ పౌర్ణమి నేపథ్యంలో నాంచారమ్మ తల్లికి అర్చకులు ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. శలపాడు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై పొంగళ్లు పొంగించి, మొక్కులు తీర్చుకున్నా రు. తిరునాళ్ల సందర్భంగా భక్తులు ఆలయ ప్రాంగణంవద్ద భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.



భారీ విద్యుత్ ప్రభలు



ప్రత్యేక అలంకరనలో నాంచారమ్మతల్లి

విద్యార్థులు సమాజసేవ అలవర్చుకోవాలి

కేఎల్‌యూ డీన్ డాక్టర్ సిహెచ్ హనుమంతరావు

తాడేపల్లిరూరల్ : ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే సమాజ సేవను అలవర్చుకోవాలని కేఎల్‌యూ డీన్ డాక్టర్ సీహెచ్ హనుమంతరావు సోమవారం అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్‌యూ ఫార్మసీ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కొలనుకొండలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి గత వారంరోజులుగా సమాజ సేవ చేస్తున్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ గత వారం రోజులుగా ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా వలంటీర్లు వేసవి కాలంలో నీటిపొదుపై ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారని, విద్యుత్ వినియోగంపై సూచనలు చేశారని, ఫార్మసీ విద్యార్థులు ఇంటింటికి హిమోగ్లోబిన్, బ్లడ్ గ్రూప్ పరీక్షలు చేయడం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు పెంపకంపైఅవగాహన కల్పించారని, వ్యవసాయ కూలీలకు, వీధి వ్యాపారులకు ఎండ తీవ్రత నుంచి ఎలా రక్షించుకోవాలో సూచనలు చేయడం జరిగిందని అన్నారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి, వలంటీర్లను యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ.వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి విభాగాధిపతి సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్.సుప్రియలు అభినందించారు.

లక్ష తమలపాకులతో పూజ

గుంటూరు ఎడ్యుకేషన్: సినీ నటుడు రామ్‌చరణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో సోమవారం కొత్తపేటలోని ఆంజనేయస్వామివారి దేవస్థానంలో లక్ష తమలపాకులతో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అఖిల భారత చిరంజీవి యువత కార్యనిర్వాహక అధ్యక్షుడు మేకల రవీంద్రబాబు మాట్లాడుతూ ఈనెల 27న రామ్‌చరణ్ జన్మదినం సందర్భంగా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిరు అభిమానులు పాల్గొన్నారు.

వైభవంగా ధనలక్ష్మీ నారాయణుల కల్యాణం



పాత గుంటూరు: అరండల్‌పేట అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి 29వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు విద్యారణ్యభారతి మహాస్వామి, ఆలయ ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీ చక్రాభిషేకం, నిత్యపూజలు అనంతరం ధనలక్ష్మీ నారాయణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు, అనేక పుష్పాలతో అభిషేకం, విశేష హారతి మంత్ర పుష్పం, అష్టోత్తర పూజ, ఓం నమో నారాయణాయ మంత్రంతో శ్రీ ధనలక్ష్మీ నారాయణుల కల్యాణం కనులపండువగా జరిగింది. విశేషంగా పాల్గొన్న దంపతులు భక్తులు తీర్థ ప్రసాదాలను అందుకున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మంగళగిరి: నగరంలో వేంచేసియున్న లక్ష్మీనృసింహస్వామి దివ్య రథోత్సవం సందర్భంగా ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సోమవారం దివ్య రథోత్సవంలో ఏర్పాటు చేసిన విచిత్ర వేషధారణలు, కోలాటం, నృత్యాలు, మేళతాళాల వంటి ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ఘనంగా శ్రీవారి కల్యాణమహోత్సవం



పాత గుంటూరు: ఆర్.అగ్రహారం వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 28వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారి కల్యాణ మహోత్సవం అత్యంత రమణీయంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, నిత్యార్చన, నారాయణ మంత్ర హవనం, బలిహరణం తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం లక్ష్మీ, గోదా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం భక్తిప్రపత్తులతో గావించారు. భక్తులు విశేషసంఖ్యలో పాల్గొని స్వామిని సేవించి తరించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిపారు. సాయంత్రం నిత్య హోమం, రథాంగ హోమం, రథ బలి, రథోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకులు కన్నా లక్ష్మీనారాయణ, ఆలయ కార్యదర్శులు పాతకోట బ్రాహ్మణయ్య నాయుడు, దాసరి భాస్కరరావు తదితరులు పర్యవేక్షించారు

ఓటు హక్కును వినియోగించుకోండి



సుల్తానాబాద్‌లో ఓటు హక్కుపై అవగాహన కలిగించే ముగ్గు



ప్రతిజ్ఞ చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ అనూష

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనూష

తెనాలిఅర్బన్: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్‌లో మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొని ఓటు విలువను తెలియజేసే ముగ్గులను అక్కడ రూపొందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు ఒక వజ్రాయుధమని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. అందరూ నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఓటు వినియోగిస్తామనే ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎ.రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు, వై.అనుపమ, టి.సుధాకర్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు

మండలాల అధ్యక్షులను ప్రకటించిన పార్టీ కేంద్ర కార్యాలయం



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పలు అనుబంధ విభాగాల పదవుల్లో పలువురిని నియమిస్తూ.. ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

■ **తెనాలి నియోజకవర్గంలో...**

తెనాలి నియోజకవర్గంలో తెనాలి మున్సిపల్ క్లస్టర్ 1 ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా ఉన్నవ ప్రశాంత్, బీసీ విభాగం అధ్యక్షుడిగా తాడిబోయిన కృష్ణ, మహిళా విభాగం అధ్యక్షురాలిగా లక్ష్మీప్రసన్న, మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా షేక్ జిలాని, మున్సిపల్ క్లస్టర్ 2 ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా బండ్లమూడి నాగేశ్వరరావు (నాని), బీసీ విభాగం అధ్యక్షుడిగా పెదలంక వెంకటేశ్వరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా రావులపల్లి నాగలక్ష్మీ, మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా షేక్ జిలాని, తెనాలి మండల పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా పినపాటి అనిల్‌కుమార్, బీసీ విభాగం అధ్యక్షుడిగా టి.శ్రీరామ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా గోపిశెట్టి రమాదేవి, మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా షేక్ మొహమ్మద్‌జానీ, కొల్లిపర మండలం పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా ఎ.సురేష్, బీసీ విభాగం అధ్యక్షుడిగా మోర్ల శ్రీనివాసరావు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా డి.రాజకుమారి, మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా షేక్ సైదాలను నియమించారు.

నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన

తెనాలి: రూరల్ మండలం పెదరావూరు–కూచిపూడి రహదారిలో గల జగనన్న లే అవుట్‌లో శ్రీధన్వంతరి నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాలుకు సోమవారం శంకుస్థాపన చేశారు. సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించనున్న కమ్యూనిటీ హాలుకు ప్రధాన కార్యదర్శి కురగంటి రవిశంకర్, వైకుంఠపురం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు కురగంటి సునీత పూజ కార్యక్రమం నిర్వహించారు. గత నాలుగైదు దశాబ్దాలుగా పట్టణంలోని నాయీబ్రాహ్మణులకు కమ్యూనిటీ హాలు లేదని గుర్తు చేశారు. తమ సంఘీయుల విజ్ఞప్తి మేరకు స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పెదరావూరులోని జగనన్న కాలనీ లే అవుట్‌లో ఇటీవల మూడు సెంట్ల భూమిని కమ్యూనిటీ హాలుకు కేటాయించారని గుర్తు చేశారు. తమ చిరకాల వాంఛను నెరవేర్చిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు. శంకుస్థాపనలో నాయీబ్రాహ్మణ సంఘీయులు వల్లూరు సుబ్రహ్మణ్యం, కొడాలి సుబ్రహ్మణ్యం, ఎదురూరి వెంకటేశ్వర్లు, రిమ్మనపూడి నరసింహారావు, కాకాని వెంకటేశ్వర్లు, చందర్లపాటి సూర్యవెంకటేష్, మున్నంగి సత్యం తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న రవిశంకర్, సునీత దంపతులు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

తెనాలిరూరల్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మరీ ముఖ్యంగా ఎన్నికల సమయంలో అలజడులు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని వన్‌టౌన్ సీఐ జి.దశరథ రామారావు హెచ్చరించారు. తెనాలి వన్‌టౌన్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు సోమవారం పట్టణంలోని చినరావూరుతోట, రామలింగేశ్వరపేట, నెహ్రూరోడ్డు, డిపో సెంటరు, బోస్‌రోడ్డులో రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. అసాంఘిక శక్తులను గుర్తించి కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు ఎన్నికల్లో తమ ఓటుని సద్వినియోగం చేసుకునేందుకు ఎలాంటి భయాందోళనకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు భద్రత మీ వెంటే ఉంటుందన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించేందుకు అన్ని ప్రాంతాల్లో రూట్ మార్చ్ నిర్వహిస్తున్నటుట్ తెలిపారు.



రూట్ మార్చ్‌లో సీఐ దశరథరామారావు, కేంద్ర బలగాలు

స్వర్ణాంధ్రప్రదేశ్ జగన్‌తోనే సాధ్యం

తెనాలిఅర్బన్: స్వర్ణాంధ్రప్రదేశ్ కల సాకారం కావాలంటే ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికలు పేర్కొన్నారు. 13వ వార్డులో సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి కరపత్రాలను పంపిణీ చేశారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు అందరూ ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. చినరావూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే చినరావూరులోని పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కుర్రా సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు కుర్రా శ్రీను, తాడిబోయిన రమేష్, చుక్కా ఆనంద్, దేవరపల్లి కిషోర్‌కుమార్, చుండూరు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థిస్తున్న పుష్ప, రాధిక